పర్మిట్‌ రూమ్‌కు నో పర్మిషన్‌

కంటోన్మెంట్‌ పరిధిలో పర్మిట్‌ రూములలో కుళ్లిన మాంసంతో వంటకాలు

నగరంలోని మద్యం దుకాణాల వద్ద సాధారణంగా పర్మిట్‌ రూమ్స్‌ ఉంటాయి.. వీటికి అనుమతులు ఇచ్చేది జీహెచ్‌ఎంసీ అధికారులే.. అయితే కంటోన్మెంట్‌ బోర్డు పరిధి మాత్రం జీహెచ్‌ఎంసీకి సంబంధం లేదు. బోర్డు పరిధిలోని ఫుడ్‌కోర్టులు, పర్మిట్‌ రూమ్స్‌కు బోర్డు అధికారులే అనుమతులివ్వాలి.. విచిత్రమేమంటే బోర్డు పరిధిలోని వైన్‌ షాపుల వద్ద పర్మిట్‌ రూమ్స్‌ ఉన్నాయి కానీ వాటికి అనుమతులే లేవు. ఏళ్ల తరబడి ఈ తంతు ఇలాగే కొనసాగుతోంది..పాడైపోయిన చికెన్‌తో ఆహార పదార్థాలు తయారుచేస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.. పర్మిట్‌ రూమ్స్‌ను క్లోజ్‌ చేసేందుకు సమాయత్తమవుతున్నారు.
– కంటోన్మెంట్‌

- 'అన్నానగర్‌' ఘటనతో అప్రమత్తమైన బోర్డు అధికారులు
- అనుమతిలేని ఫుడ్‌కోర్టుల మూసివేతకు ఆదేశాలు
- పర్మిట్‌ రూమ్స్‌ మూసివేతకు చర్యలు

సికింద్రాబాద్‌ కంటోన్మెంట్‌ పరిధిలో పర్మిట్‌ రూమ్స్‌, బార్ల వద్ద చికెన్‌ ఫ్రై తింటున్నారు.. అయితే తస్మాత్‌ జాగ్రత్త..మీరు తినే ఆ చికెన్‌ కొన్ని నెలల పాటు నిల్వ చేసి కుళ్లిన చికెన్‌ అయి ఉండవచ్చు... ఎందుకంటే నార్త్‌జోన్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు అన్నానగర్‌లో రెండు చికెన్‌ షాపుల్లో దాడులు నిర్వహించి సుమారు 600 కిలోల కుళ్లిన మాంసం ఉన్నట్లు గుర్తించారు. అది స్థానికంగా ఉన్న పర్మిట్‌ రూమ్స్‌కు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

ఆహార భద్రత కరువు

సుమారు 4 లక్షల మంది నివసించే కంటోన్మెంట్‌ ప్రాంతంలో ఆహార భద్రత కరువైంది. నగర వ్యాప్తంగా ఫుడ్‌ కోర్టులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నప్పటికీ, కంటోన్మెంట్‌లో మాత్రం ఆ జాడే లేదు. అసలు ఈ ప్రాంతంలో ఆహార భద్రత ఎవరి పరిధిలోకి వస్తుందో అధికారులకే అవగాహన లేకపోవడం శోచనీయం. ప్రత్యేక చట్టానికి లోబడి, రక్షణ శాఖ పరిధిలోని అధికారుల పాలనలో సాగే కంటోన్మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర చాలా పరిమితంగా ఉంటుంది. మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ అంతా అటానమస్‌ బాడీగా అయితే కంటోన్మెంట్‌ బోర్డు ఆధ్వర్యంలోనే సాగుతుంది. ఇంజినీరింగ్‌, సానిటేషన్‌, తాగునీటి సరఫరా, ట్యాక్స్‌ విభాగాలు తప్ప, కంటోన్మెంట్‌లో ఆహారం, ఆరోగ్యం, ఫైర్‌ వంటి విభాగాలే లేవు. శానిటేషన్‌ సిబ్బందే ఫుడ్‌ సేఫ్టీ అధికారులుగా చెలామణి అవుతూ ఉండటం దారుణం. దీంతో ఈ ప్రాంతం అక్రమార్కులకు స్వర్గధామంగా మారుతోంది. ముఖ్యంగా



బోయిన్‌పల్లిలోని ఓ వైన్స్‌ సమీపంలో పర్మిట్‌ రూమ్‌ పేరిట కొనసాగుతున్న ఫుడ్‌కోర్టులు

వైన్‌షాపుల వద్ద పర్మిట్‌రూమ్‌ల పేరిట వెలిసిన ఫుడ్‌కోర్టుల్లో కుళ్లిన మాంసం విక్రయిస్తున్నట్లు తేలడం గమనార్హం. దీంతో ఎట్టకేలకు బోర్డు అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

నాడు ఆర్మీ ఆధ్వర్యంలో దాడులు..

కంటోన్మెంట్‌లో ఫుడ్‌ సేఫ్టీకి సంబంధించి ఎలాంటి విభాగం లేకపోయినప్పటికీ, ఇక్కడి ఆహార భద్రతపై గతంలో ఆర్మీ అధికారులు చొరవచూపిన సందర్భాలున్నాయి. స్థానిక మిలిటరీ స్టేషన్‌ కమాండర్‌ అయిన, సీనియర్‌ ఎగ్జిక్యూటివ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ (ఎస్‌ఈఎంఓ) కంటోన్మెంట్‌ బోర్డులో ఎక్స్‌ అఫీషియో మెంబర్‌గా కొనసాగుతారు. వైద్య, ఆరోగ్య విభాగాలు ఈ అధికారి నియంత్రణలోనే పనిచేయాల్సి ఉంటుంది. అయితే కంటోన్మెంట్‌లో భవన నిర్మాణాలకు సంబంధించి భద్రతా ప్రమాణాలు పర్యవేక్షించి, ఎన్‌ఓసీలు జారీ చేయడం మినహా వైద్య, ఆరోగ్యం, ఆహార భద్రత విభాగాలపై దృష్టి సారించిన దాఖాలల్లేవు. అయితే పదేళ్ల క్రితం కంటోన్మెంట్‌ పరిధిలోని హోటల్స్‌, బార్‌లు, వైన్‌షాపులపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మిలటరీ అధికారులు దాడులు నిర్వహించి, పలు బార్‌లు, రెస్టారెంట్‌లను మూసివేయించారు. అనంతరం మళ్లీ మిలటరీ అధికారులు ఈ విషయంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోలేదు. దీన్ని అలుసుగా తీసుకున్న కంటోన్మెంట్‌ శానిటేషన్‌ విభాగం అధికారులు అంతా తామే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఏకంగా ఫుడ్‌ కోర్టులకు సైతం ట్రేడ్‌లెసెన్సులు ఇచ్చేస్తున్నారు. ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ల తరహాలో సానిటేషన సిబ్బందే హోటల్స్‌, చికెన్‌, మటన్‌ షాపులపై అజమాయిషీ కొనసాగిస్తున్నారు.

చర్యలకు ఉపక్రమించిన బోర్డు

కంటోన్మెంట్‌ వ్యాప్తంగా కొనసాగుతున్న పర్మిట్‌ రూమ్‌లు, ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్‌లపై చర్యలకు రంగం సిద్ధం చేశారు. శుక్రవారం జేబీఎస్‌ సమీపంలోని నాలా వెంబడి కొనసాగుతున్న ఫుడ్‌ కోర్ట్స్‌ సహా పలువురు వీధి వ్యాపారులను బోర్డు కార్యాలయానికి పిలిపించి తక్షణమే వాటిని మూసేయాల్సిందిగా ఆదేశించారు.

పర్మిట్‌ రూమ్‌లు మూసేస్తాం

ప్రజారోగ్యానికి విఘాతం కలిగించేలా కొనసాగుతున్న ఫుడ్‌కోర్టులపై తక్షణమే చర్యలు చేపడతాం. ముఖ్యంగా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని ఫుడ్‌కోర్టులను మూసేవేస్తాం. వైన్‌షాపులను ఆనుకుని నిర్వహించే పర్మిట్‌ రూమ్‌లలో ఆహార పదార్థాల తయారీ, విక్రయాలకు బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ఆయా ఫుడ్‌కోర్టులలో కుళ్లిన మాంసాన్ని వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తక్షణమే వాటిని మూసివేస్తాం.
– మధుకర్‌ నాయక్‌, కంటోన్మెంట్‌ సీఈఓ

మృతుడి కుటుంబాలకు 'ఈటల' పరామర్శ



లాలాపేట: కుంభమేళా తీర్థయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రసాద్‌ కుటుంబాన్ని గురువారం రాత్రి మల్కాజిగిరి పార్లమెంట్‌ సభ్యులు ఈటల రాజేందర్‌ పరామర్శించారు. తార్నాకలోని ఉమా సిగ్నేచర్‌ అపార్టుమెంట్‌లో మృతుడు ప్రసాద్‌ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

'మా అమెరికా పర్యటన' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌

లాలాపేట: డా.లక్కరాజు నిర్మల రచించిన మా అమెరికా పర్యటన అనే పుస్తకాన్ని శుక్రవారం తార్నాకలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్‌ కోదండరాం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు భాగయ్య, కొండపల్లి నరసింహారావు పాల్గన్నారు.

ఫుట్‌బాల్‌ గ్రౌండ్‌లో నేడు రైల్వే కార్మికుల సభ

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్‌ చేస్తూ శనివారం నిర్వహిస్తున్న సభను రైల్వే కార్మికులు విజయవంతం చేయాలని ఐఆర్‌ఎంపీఏస్‌ అధ్యక్షుడు సంతోష్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి డేనియల్‌ ఒక ప్రకటనలో తెలిపారు. లాలాగూడలోని రైల్వే క్యారేజ్‌ వర్క్‌షాప్‌ సమీపంలోని ఫుట్‌బాల్‌ గ్రౌండ్‌లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సభ నిర్వహించనున్నట్లు వివరించారు.

సమస్యలు పరిష్కరించండి


మంత్రి దామోదర్‌ రాజనర్సింహతో ఉప కులాల సంఘం నాయకులు

అడ్డగుట్ట: ఆరోగ్య శాఖ మంత్రి, ఎస్సీ వర్గీకరణ ఉప సంఘం కన్వీనర్‌ దామోదర్‌ రాజనర్సింహను 57 ఉప కులాల జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో అడ్డగుట్టకు చెందిన పలువురు ఉప కులాల నేతలు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా నాయకులు తమ సమస్యలను వివరించారు. 57 ఉపకులాల సమస్యలు పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. మాంగ్‌గరోడీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సనాధన్‌, ఉపాధ్యక్షుడు రతిలాల్‌, గోపి, సంజు, మహేష్‌, మోతిలాల్‌, నరేష్‌ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: వైద్య చికిత్సకు ఆర్థిక సమస్య అడ్డు కారాదని.. అందుకే సీఎంఆర్‌ఎఫ్‌ పథకం ఉందని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. శుక్రవారం వెస్ట్‌ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో బల్కంపేటకు చెందిన రాజేశ్వరికి సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.2.75 లక్షల ఎల్‌ఓసీని బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు నామన సంతోష్‌ మణి కుమార్‌, అశోక్‌యాదవ్‌, కూతురు నర్సింహ, బల్‌రాం పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



అమీర్‌పేట: సనత్‌నగర్‌ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. స్థానిక నాయకులతో కలిసి అమీర్‌పేట డివిజన్‌ కుమ్మరి బస్తీలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరిన్ని అభివృద్ధి పనుల కోసం రూపొందించిన జాబితాను జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందించామని తెలిపారు. కుమ్మరి బస్తీలో చేపట్టవలసిన పనుల నిమిత్తం రూ.45 లక్షలు కేటాయించారని చెప్పారు. రోడ్లు,డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ జమీల్‌,వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేష్‌, కాంగ్రెస్‌ నాయకులు గుడిగె ప్రతాప్‌ నాయక్‌, సత్యనారాయణ యాదవ్‌ పాల్గొన్నారు.

17న ఘనంగా కేసీఆర్‌ జన్మదిన వేడుకలు


సమావేశంలో మాట్లాడుతున్న సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్‌ పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఈ నెల 17న ఘనంగా నిర్వహించనున్నట్లు సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ తెలిపారు. ఈ నేపథ్యంలో సనత్‌నగర్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ ముఖ్య నాయకులతో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌, మాజీ మంత్రి హరీష్‌రావులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరవుతారని వివరించారు. ఈ వేడుకల్లో కేక్‌ కటింగ్‌, సాంస్కృతిక కార్యక్రమాలు, కేసీఆర్‌ జీవిత, రాజకీయ ప్రస్థానాన్ని వివరించేలా రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆతిథ్య రంగంలో ఉద్యోగ అవకాశాలు పుష్కలం


జాబ్‌మేళాకు హాజరైన యువత

సనత్‌నగర్‌: ఆతిథ్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టీజీఎస్‌సీహెచ్‌ఈ) సెక్రటరీ శ్రీరామ్‌ వెంకటేష్‌ స్పష్టం చేశారు. బేగంపేటలోని ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ హోటల్‌ మేనేజ్‌మెంట్‌–శ్రీశక్తి ఆధ్వర్యంలో ఆతిథ్య రంగ విద్యార్థుల కోసం జాబోథాన్‌–2025 పేరిట ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీరామ్‌ వెంకటేష్‌ మాట్లాడుతూ ఉద్యోగ మేళా ద్వారా ఉన్నత ఉద్యోగ అవకాశాలను కల్పించడం శుభపరిణామం అన్నారు. విద్యార్థులందరూ ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ కెరీర్‌ను ఉన్నతంగా మలచుకోవాలన్నారు. శ్రీశక్తి ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ సత్యపింజల, డైరెక్టర్‌ యమునా రంగారావు, ప్రిన్సిపాల్‌ అనితాచంద్రన్‌, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తా'


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్యే శ్రీగణేష్‌

రాంగోపాల్‌పేట: కేంద్ర ప్రభుత్వ నిధులతో కంటోన్మెంట్‌ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. రెజిమెంటల్‌ బజార్‌ గురుద్వారా వద్ద రూ.37 లక్షల వ్యయంతో చేపట్టిన వరద నీటి పైప్‌లైన్‌ నిర్మాణ పనులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 6 నెలల్లో నియోజకవర్గంలో సుమారు రూ. 7 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు..రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను తీసుకుని వస్తామని ఆయన హామీ ఇచ్చారు.. కార్యక్రమంలో డీసీ సమ్మయ్య, స్థానిక కార్పొరేటర్‌ కొంతం దీపిక పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్‌ జవాన్లకు నివాళి



సనత్‌నగర్‌: ఉగ్రవాదుల దాడిలో ఆసువులు బాసిన సీఆర్‌పీఎఫ్‌ జవాన్లకు బీజేపీ నేతలు నివాళులు అర్పించారు. ఆ పార్టీ సీనియర్‌ నేత నెమలి ఆనంద్‌ (నందు) ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్‌, మహేష్‌కుమార్‌, వెంకటేష్‌యాదవ్‌, పాండియన్‌, నాగేష్‌, శ్రావణ్‌, వేణు, గణేష్‌, మధుసూదన్‌ రావు, శ్రీరామ్‌, బాబురావు, మహేష్‌, లోహిత్‌ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్‌ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: సేవలాల్‌ మహారాజ్‌ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్‌, డోర్నకల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ రాంచంద్రు నాయక్‌ అన్నారు. శుక్రవారం గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్‌ ఆధ్వర్యంలో సేవాలాల్‌ జయంతి సందర్భంగా 2కె రన్‌ నిర్వహించారు. ఓయూ ప్రవేశ ద్వారం ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్‌ కాలేజీ వరకు జరిగిన 2కె రన్‌ ప్రభుత్వ విప్‌తో మాజీ మంత్రి రవీంద్ర నాయక్‌ పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


ఓయూలో 2కె రన్‌ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

'మహిళాభ్యున్నతికి మోదీ సర్కార్‌ కృషి'


మాట్లాడుతున్న వెల్లాల రామ్మోహన్‌

సనత్‌నగర్‌: మహిళాభ్యున్నతికి మోదీ సర్కార్‌ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని బీజేపీ సీనియర్‌ నేత వెల్లాల రామ్మోహన్‌ అన్నారు. మహిళా కార్యకర్తలతో సనత్‌నగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశమై పార్టీ పటిష్టతకు అనుసరించాల్సిన విధానాలపై మార్గనిర్దేశం చేశారు. పథకాల గురించి మహిళలకు తెలియపరిచి బీజేపీ మహిళామోర్చా పటిష్టతకు కృషి చేయాలన్నారు. మహిళలకు బీజేపీ తగిన గుర్తింపునందిస్తూ రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా చేసేందుకు ఎన్నో రకాల కార్యక్రమాలను చేపడుతుందన్నారు.

ఐటీడీఏలను ఏర్పాటు చేయాలి

లాలాపేట: రాష్ట్రంలో ఐదు ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘాల ఐక్య వేదిక నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. శుక్రవారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ ఎస్టీ డిక్లరేషన్‌ సభలో ప్రకటించిన విధంగా సంత్‌ సేవాలాల్‌, కొమురం భీం, ఎరుకల ఏకలవ్య కార్పొరేషన్‌లను వెంటనే ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఆదివాసి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. ఐక్య వేదిక రాష్ట్ర చైర్మెన్‌ ఎల్‌. రూప్‌ సింగ్‌, వైస్‌ చైర్మెన్‌ లోకిని రాజు పాల్గొన్నారు.

బేగంపేటలో ప్రతి గురువారం సమీక్ష

సనత్‌నగర్‌: బేగంపేట డివిజన్‌ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే లక్ష్యంగా ప్రతి గురువారం 'బేగంపేట ప్రగతి సమీక్షా శిబిరం' నిర్వహించనున్నట్లు కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు విశాల్‌ సూదం తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ సనత్‌నగర్‌ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ సమక్షంలో గురువారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో నేతలు తమ దృష్టికి వచ్చిన సమస్యలతో పాటు పౌరులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు తెలియజేయడం ద్వారా అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం జరిగేలా చూస్తారని పేర్కొన్నారు.

రైలులోంచి పడి యువకుడి మృతి

సికింద్రాబాద్‌: నడుస్తున్న రైలు బోగీ లోంచి ప్రమాదవశాత్తు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం సికింద్రాబాద్‌ రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవునూరు గ్రామానికి చెందిన పోతి వినోద్‌ (28) తన బావమరిదితో కలిసి కామారెడ్డి నుంచి సికింద్రాబాద్‌కు రైలులో బయలుదేరారు. రైలు జనరల్‌ బోగీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయి ఉంది. రైలు మనోహరాబాద్‌ – మేడ్చల్‌ రైల్వే స్టేషన్ల మధ్య చేరుకున్న సమయంలో చిన్న కుదుపు రావడంతో డోర్‌ నుంచి వినోద్‌ జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో వినోద్‌ అక్కడి కక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

చిలకలగూడ: సికింద్రాబాద్‌ నియోజకవర్గంలో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్‌ నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి నేతృత్వంలో పలువురు జలమండలి జీఎం వినోద్‌ కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మెట్టుగూడ డివిజన్‌ మైలార్‌గడ్డ, బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా ప్రాంతాల్లో కలుషిత జలాల సరఫరా, స్ట్రీట్‌ నంబర్‌1లో మంచినీటి పైప్‌లైన్‌ పొడిగింపు, సీతాఫల్‌ మండి డివిజన్‌ అన్నానగర్‌, దూద్‌బావి కమ్యూనిటీ హాలువద్ద పవర్‌బోర్లు రిపేరు, భవానీనగర్‌లో అర్ధాంతరంగా ఆగిన డ్రైనేజీ పైప్‌లైన్‌ తదితర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌ నాయకులు పాపాలాల్‌, శంకరరావు, రామాంజనేయులు, చంద్రమోహన్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

సికింద్రాబాద్‌: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌ బ్రాంచ్‌ టికెట్‌ చెకింగ్‌ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మజ్దూర్‌ యూనియన్‌ జోనల్‌ సెక్రటరీ సీహెచ్‌ శంకర్‌రావు హామీ ఇచ్చారు. శుక్రవారం యూనియన్‌ సికింద్రాబాద్‌ డివిజనల్‌ కార్యాలయంలో టికెట్‌ చెకింగ్‌ బ్రాంచ్‌ మొదటి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జోనల్‌ జనరల్‌ సెక్రెటరీ శంకర్‌ రావు మాట్లాడుతూ త్వరలో ఉద్యోగుల సమస్యలకు రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతామన్నారు. సమావేశంలో బ్రాంచ్‌ చైర్మన్‌ ఫరీద్‌, సికింద్రాబాద్‌ డివిజనల్‌ కార్యదర్శిరవీందర్‌, నాయకులు నర్సింహా రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైరన్లు, మల్టీటోన్‌ హారన్లు వినియోగిస్తే చర్యలు

సికింద్రాబాద్‌: వాహనదారులు సైరన్‌, మల్టీటోన్‌ హారన్లను వినియోగిస్తే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని చిలకలగూడ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం మెట్టుగూడ, ఆలుగడ్డబావి ప్రధాన రహదారిలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించిన పోలీసులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసులు మాట్లాడుతూ వాహనాలు కొనుగోలు చేసిన సమయంలో సదరు వాహనాల ఉత్పత్తిదారులు బిగించిన హారన్లు మాత్రమే వినియోగించాలని సూచించారు.

మహ్మద్‌గూడలో కార్పొరేటర్‌ పర్యటన

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండి డివిజన్‌ మహ్మద్‌గూడలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్‌ సామల హేమ జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. తరచూ కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతుండటంతో అక్కడికి వెళ్లి సమస్యను సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు సమస్యను వివరించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో జలమండలి సెక్షన్‌ మేనేజర్‌ నవ్య పాల్గొన్నారు.

నేడు భరత్‌గౌడ్‌ బాధ్యతల స్వీకరణ

సనత్‌నగర్‌: బీజేపీ మహంకాళి–సికింద్రాబాద్‌ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన భరత్‌గౌడ్‌ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం చిక్కడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నుంచి ముషీరాబాద్‌ మెట్రో స్టేషన్‌ వరకు బైక్‌ ర్యాలీ చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర యువనేత మర్రి పురురవరెడ్డి తెలిపారు. కళిష్‌ ఫంక్షన్‌ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు పదవీ బాధ్యత స్వీకారోత్సవం ఉంటుందన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి


అడ్డగుట్టలో పర్యటిస్తున్న డిప్యూటీ కమిషనర్‌

అడ్డగుట్ట: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులకు సూచించామని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్‌ సర్కిల్‌ డీసీ సుభాష్‌ రావు తెలిపారు. ఇటీవల స్థానిక సమస్యలపై బీజేపీ దిశా కమిటీ సభ్యులు డీసీ సుభాష్‌రావును కలిసి అడ్డగుట్టలోని పెండింగ్‌ సమస్యల గురించి వివరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డీసీ అడ్డగుట్టలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వీలైనంత తొందరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేష్‌, నరేందర్‌, హంసరాజు, తదితరులు పాల్గొన్నారు.